

మురళీకృష్ణుడిగా నారసింహుడు

యాదాద్రి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నారసింహుడు మురళీ కృష్ణుడిగా దర్శనమిచ్చారు. - 8లో

27న మోత్కూర్ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్ ఇన్'

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' సోమవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్



సి.శ్రీకాంత్ , మున్సిపల్ కమిషనర్ ,మోత్కూర్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 88868 83666

ఉద్యోగం.. కల్యాణ ప్రాప్తిరస్తు!

తాళికట్టు శుభవేళ 'కల'లో కళ్యాణమాల... వివాహం పెద్ద పరీక్షగా మారింది. ముప్పై దాటుతున్నా మూడు ముళ్లు వేయలేకపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఏడడుగులు వేసే ఆ మధుర గడియ ఎండమావిగా మారింది. అందం.. అర్హత.. ఆస్తిపాస్తులు.. ఉద్యోగం.. హోదా.. పెళ్లికోసం ప్రధాన అంశాలుగా మారాయి. వధువు కోసం వరుడు.. గూగుల్ సెర్చ్ చేయాల్సి వస్తోంది. అతని హోదా పోయి ఆయన హోదా ఎప్పుడొస్తుందోనన్న బెంగ పెళ్లికాని ప్రసాద్‌లలో కనిపిస్తోంది. తలంబ్రాలు పడడం లేదని తలలు పట్టుకుంటున్నారు. అదే సమయంలో అమ్మాయికి తగిన వరుడి కోసం తల్లిదండ్రులు కాళ్లకు బలపాలు కట్టుకొని తిరుగుతున్నారు. తమ బిడ్డకు కొంగుముడి కట్టించాలని కోటి దేవతలకు మొక్కుతున్నారు.

జీవితంలో స్థిరపడ్డాకే మూడుముళ్ల బంధంలోకి..

- జాబ్ ఫస్ట్.. మ్యారేజ్ నెక్ట్స్ అంటున్న యువకులు
- ఉద్యోగం, ఉపాధి వేటలో 30 ఏళ్లు క్రాస్..
- పెరిగిపోతున్న పెళ్లికాని ప్రసాద్‌లు
- పలువురి యువతులది కూడా అదేబాట
- మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్న వారిలో ముప్పై ఏళ్ల పైవారే అధికం
- వధువుల కోసం పొరుగు రాష్ట్రాలకు పయనం
- లేట్ మ్యారేజ్‌తో సంతాన లేమి సమస్యలు ఎదురవుతాయంటున్న వైద్యులు



వధువు కోసం ఒడిశాకు..

మన దగ్గర అమ్మాయిలు దొరకడం లేదని వధువుల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్తున్నారు. చిట్యాలలో ఓ మ్యారేజ్ బ్యూరో ఒడిశా రాష్ట్రానికి చెందిన వారితో 150కు పైగా వివాహాలు జరిపించినట్లు తెలిసింది. ప్రధానంగా కొన్ని సామాజిక వర్గాల్లో సమస్య తీవ్రంగా ఉంది. బీసీ, మధ్య తరగతి వారు వివాహబంధానికి ముప్పుతిప్పలు పడాల్సివస్తోంది. నల్లగొండ మండలంలోని నాలుగు గ్రామాల్లోని కొందరు యువకులు ఒడిశాకు చెందిన అమ్మాయిలను వివాహం చేసుకున్నారు. అమ్మాయి తల్లితండ్రులకు రూ.50 వేలు ఇచ్చి, వివాహ ఖర్చులు భరించి మూడు ముళ్లు వేస్తున్నారు.

బొడ్డు జనార్దన్‌రెడ్డి

పెళ్లి.. జీవితంలో మరువురాని మధుర ఘట్టం. అయితే నేటి యువత మొదట కెరీర్ ఆ తర్వాతనే పెళ్లి అంటోంది. పాతరోజుల్లో అయితే అమ్మాయిలకు 16, అబ్బాయిలకు 20 ఏళ్లకే పెళ్లి చేసేవారు. కానీ పెద్ద చదువులు.. జీవితంలో స్థిరపడడం, గౌరవమైన ఉద్యోగమంటూ నేటి యువత వివాహాన్ని వాయిదా వేస్తోంది. ఉద్యోగ వేటలో పడిన యువతీ యువకులు 30 ఏళ్లు దాటాకే పెళ్లి గురించి ఆలోచిస్తున్నారు. ఏజ్‌బార్ కావడంతో వారికి భాగస్వామి దొరకడం లేదు. పెళ్లి బంధం ఆలస్యం అవుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. తమ పిల్లలు నుదట బాసింగం కట్టుకునే యోగానికి నోచుకోలేకపోతున్నారని మథనపడుతున్నారు.




సండే స్పెషల్

మ్యారేజ్ బ్యూరోల బాట

జీవితంలో స్థిరపడాలన్న ఆలోచనలతో యువత చదువు, ఉద్యోగాల వేటలో పడి పెళ్లిపీటలు ఎక్కడంలో ఆలస్యమవుతోంది. తమకు నచ్చిన భాగస్వామి ఎంపిక కోసం అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది (అబ్బాయిలు, అమ్మాయిలు) మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్న వారిలో 27 సంవత్సరాల నుంచి 38 ఏళ్ల మధ్య వయస్సు వారు ఉంటున్నారు. వీరిలో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లతో పాటు విదేశాల్లో ఉపాధి పొందుతున్న వాళ్లు అధికంగా ఉంటున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని అబ్బాయిలు (30 ఏళ్ల పైబడిన) కూడా మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన, ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిలు కూడా వరుడి కోసం మ్యారేజ్‌బ్యూరోలను సంప్రదిస్తున్నారు. తమను కట్టుకోబోయేవాడు తమకంటే మెరుగైన చదువు, ఉద్యోగం ఉండాలని చూస్తున్నారు. అలాంటి వ్యక్తి దొరికితేనే పెళ్లికి ఓకే చెబుతున్నారు.

ఈ కింది అంశాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 800 మంది యువతీ యువకులను సర్వే చేయగా వారు వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇవీ.

- (నీలం) ఉద్యోగంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటాము.
- (ఎరుపు) ఉద్యోగం రాకున్నా.. ఏదైనా ఒక స్వయం ఉపాధి చూసుకుని ఆ తర్వాత పెళ్లి చేసుకుంటాము.
- (ఆకుపచ్చ) ఉద్యోగం రాకున్నా.. ఉపాధి లేకున్నా.. పెళ్లీడు రాగానే పెద్దలు చెప్పినట్లు పెళ్లి చేసుకుంటాము.



ఉన్నత స్థానంలో ఉన్నవాళ్లు కూడా వస్తున్నారు



చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా స్థిరపడేందుకే మొగ్గు చూపుతున్నారు. తర్వాతనే పెళ్లి వైపు ఆలోచన చేస్తున్నారు. మ్యారేజ్ బ్యూరోలకు వచ్చే వాళ్లలో ఎక్కువ మంది మంచి ఉద్యోగాలు, చదువుకున్న వాళ్లే ఉంటున్నారు. విదేశాల్లో ఉంటున్న యువతీ, యువకులు సంప్రదిస్తున్నారు. 27 ఏళ్ల పైబడితే బ్యూరోల వైపు వస్తున్నారు.

– యానాల ప్రతాప్‌రెడ్డి, మ్యారేజ్‌బ్యూరో నిర్వాహకుడు, సూర్యాపేట

35 నుంచి 40 ఏళ్ల మధ్య వివాహాల కోసం..



జీవితంలో స్థిరపడిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని యువత భావిస్తోంది. మా వద్దకు వయస్సు మీరిన ప్రొఫైల్స్ ఎక్కువగా వస్తున్నాయి. కొన్ని కుటుంబాల్లో అమ్మాయిల కొరత తీవ్రంగా ఉండడంతో సమీప రాష్ట్రాల నుంచి వివాహ బంధం కలుపుతున్నాం. మధ్య తరగతి నుంచి దిగువ స్థాయి కుటుంబాల్లో సైతం చదువు, ఉద్యోగం ఆ తర్వాతనే పెళ్లి అంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అమ్మాయిల వయస్సు ఎక్కువగా ఉన్నా అబ్బాయిలు పెళ్లికి ముందడుగు వేస్తున్నారు.

– వెంకన్న, మ్యారేజ్ బ్యూరో, నల్లగొండ

వయస్సు మీరిన పెళ్లిళ్లతో సంతానలేమి సమస్యలు

ప్రస్తుత కాలంలో వృత్తి పరమైన, సామాజిక, ఆర్థిక పరమైన కారణాల వల్ల సుమారు 30 సంవత్సరాల వయస్సు పైబడిన తర్వాతనే యువత పెళ్లివైపు ఆలోచన చేస్తోంది. ఆ తర్వాత కూడా వృత్తి పరమైన, ఆర్థిక స్వావలంబన, జీవితంలో కుదురుకోవడం, వివాహానంతర జీవనానందం కోసం ఇంకో ఐదు సంవత్సరాల వరకు సంతానం వైపు మొగ్గు చూపడం లేదు.

- స్త్రీలలో సరైన వయస్సులో వివాహం అయితేనే సులభంగా, అన్ని విధాలా ఆరోగ్యవంతమైన పిల్లలు కలిగే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వయస్సు పెరుగుతున్న దశలో స్త్రీల పునరుత్పత్తి శక్తి వేగంగా తగ్గిపోతుందని.. ముఖ్యంగా 35 సంవత్సరాలు దాటిన మహిళల్లో అండాశయ, గర్భాశయ, రక్తపోటు, మధుమేహం వంటి ఇతరత్రా సాధారణ ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని అంటున్నారు. గర్భసంచిలో ఫైబ్రాయిడ్లు (గడ్డలు), అండాశయాల్లో సిస్టులు, అండాల సంఖ్య తగ్గిపోవడం, గర్భాశయ అంతర్గత పొర (ఎండోమెట్రియం) పలుచబడిపోవడం వంటి సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.
- పురుషుల్లో వయస్సు మీరుతున్న వేళ వీర్యకణాల సంఖ్య, నాణ్యత తగ్గిపోవడం, దాంపత్య సుఖంపై ఆసక్తి సన్నగిల్లడం ఇతరత్రా సమస్యలు సంతానలేమికి ముఖ్య కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇవే కాకుండా 40 సంవత్సరాలు పైబడిన మగవారి వల్ల అనారోగ్యపు, బుద్ధిమాంద్యపు, జన్యుపరమైన లోపాలతో కూడిన పిల్లలు కలిగే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు.

యువత దృక్పథంలో మార్పు రావాలి



మా దగ్గరకు వస్తున్న దంపతుల్లో సుమారు 40 శాతం వరకు ఆలస్యంగా పెళ్లి చేసుకొని, వివిధ కారణాల వల్ల పిల్లల్ని కనడం వాయిదా వేసిన వాళ్లే ఉంటున్నారు. ఈ సమస్యకు యువత తమ దృక్పథాలలో స్వయంగా మార్పు తెచ్చుకోవాలి. వాస్తవాలు గ్రహించడం, జీవితంలో దశలపై అవగాహన కలిగి ఉండడం, పిల్లల్ని పెంచడం భారంగా భావించకుండా ఉండడం, తమ ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పు తెచ్చుకోవడం తప్ప మరో మార్గం లేదు.

– డాక్టర్ పద్మజా దివాకర్, సంతాన సాఫల్య వైద్య నిపుణులు, భువనగిరి



ఉద్యోగ సాధనలో బిజీ..

వేసవి వచ్చిందంటే పెళ్లిళ్ల సీజన్ వచ్చినట్టే. ఈ కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు వివాహ సంబంధాలు చూస్తుంటారు. కానీ, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసింది. దీంతో యువతీ యువకులంతా ఉద్యోగాల వేటలో పడి ప్రిపరేషన్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. పట్టణాల్లో రూమ్‌లు అద్దెకు తీసుకుని కోచింగ్‌లకు వెళ్లడం, చదువుకోవడంలో నిమగ్నమయ్యారు.

నల్లగొండలో ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న యువకులు



పల్లెల్లోకి బెట్టింగ్ సంస్కృతి!

జోరుగా ఆన్‌లైన్ క్రికెట్

- రూ.లక్షల్లో పందెం
- ఆర్థికంగా చితికిపోతున్న యువత
- అప్పుల పాలై ఆత్మహత్యలు

సాక్షి, యాదాద్రి : ఒకప్పుడు నగరాలకే పరిమితమైన బెట్టింగ్ సంస్కృతి.. పల్లెలకూ పాకింది. వన్డే, ఐపీఎల్, ట్వంటీ ట్వంటీ.. ఏదైనా సరే బెట్టింగ్ పెడుతున్నారు. ఇది కొందరికి వినోదాన్ని పంచుతుండగా మరికొందరికి కాసుల వర్షం కురిపిస్తోంది. దీనికి బానిసలుగా మారినవారు అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆ తర్వాత అప్పులు తీర్చే మార్గం లేక.. కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా యువత, విద్యార్థులు కుదేలవుతున్నారు. భువనగిరి మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన యువకుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పెట్టి అప్పులు చేశాడు. తిరిగి చెల్లించలేని పరిస్థితిలో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

యువత ఆసక్తిని అనుకూలంగా మలుచుకొని

ఐపీఎల్, ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్‌లకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. యువతలో ఆసక్తిని అనుకూలంగా మలుచుకొని కొన్ని ముఠాలు బెట్టింగ్‌కు తెరతీశాయి. ఆన్‌లైన్, సెల్‌ఫోన్‌ల ద్వారా ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. లావాదేవీలు కూడా ఆన్‌లైన్, వాట్సప్, ఫోన్ పేట, గూగుల్ పే వంటి ప్రత్యేక నెట్‌వర్క్ ద్వారా సాగిస్తున్నారు. ఫోర్, సిక్స్, వైడ్, నోబ్, మ్యాచ్ విన్నర్, వికెట్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఇలా..బెట్టింగ్ దశలు సాగుతుంటాయి. రూ.100 నుంచి రూ. లక్షల్లో దందా నడుస్తుంది. ఈ పందెం కాసేవారి లో బడావ్యాపారుల కుమారులే కాకుండా యువకులు, విద్యార్థులతో పాటు కంపెనీలు, షాపుల్లో పనిచేస్తున్న వారు పాల్గొంటూ నష్టపోతున్నారు.

మార్చి 31నుంచి ఐపీఎల్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మార్చి 31నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యువత, విద్యార్థులను బెట్టింగ్‌లోకి దించేందుకు కొన్ని ముఠాలు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కేంద్రంతో పాటు మున్సిపాలిటీలు, గ్రామాల్లో బెట్టింగ్ జరిగే అవకాశం లేకపోలేదు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ రమ్మీ వైపు యువత మొగ్గు చూపుతూ బెట్టింగ్‌లు పెట్టడం ఆందోళన కలిగిస్తోంది.

బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి



బెట్టింగ్, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన ఉండాలి. మన చుట్టుపక్కల ఎవరైనా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నట్లు తెలిస్తే నిలువరించాలి. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. అవసరమైతే పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందజేయాలి. ఇలాంటి విషయాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలి.

-సూదగాని రాజు, యువ టీం కన్వీనర్

కొన్ని ఘటనలు

- భువనగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగ్ పెట్టి రూ.20 లక్షలు అప్పులు చేశాడు. ఇంట్లో తెలుస్తుందన్న భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు.
- భువనగిరికి చెందిన యువకుడు బెట్టింగ్‌కు అలవాటు పడి రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. హైదారాబాద్‌లోని రామంతాపూర్‌లో ఓ బుకీ వద్ద బెట్టింగ్ పెట్టి నష్టపోయినట్లు తెలిసింది.
- కొందరు బెట్టింగ్‌కు పాల్పడుతుండగా పోలీసులు అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు.
- భువనగిరి మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన ఈర్ల నాగరాజు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు చేశాడు. అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితిలో మన స్థాపానికి గురై ఈనెల 24వ తేదీన బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- భువనగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటు పడ్డాడు. సుమారు కోటి రూపాయలు నష్టపోయాడు. నెలకు రూ.లక్ష వేతనం తీసుకునే సదరు యువకుడు బెట్టింగ్‌ల కోసం చివరికి ఆస్తులే కుదువపెట్టాడు. ఇంకా అప్పులు చెల్లించాల్సి ఉండడంతో తీర్చే పరిస్థితి లేక అందుబాటులో లేకుండా పోయాడు. కొన్ని నెలల తర్వాత తిరిగి వచ్చి అప్పులు తీరుస్తున్నాడు.

న్యూస్‌రీల్

మున్సిపల్ మడిగెలకు మార్చి 2న వేలం

భువనగిరిటౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న మున్సిపల్ మడిగెలకు(కూరగాయల దుకాణాలు) మార్చి 2న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీ.నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న వేలం నిర్వహించాల్సిన ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు తేదీని కూడా మార్చి 1వరకు పొడిగించినట్లు తెలిపారు.

రక్తదానం.. మహాదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరి : రక్తదానం మహాదానం అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆవిర్భా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ చిన్ననాయక్, వికలాంగులు హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురుపంగ ప్రకాష్, వనం ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు మాటూరి బాలరాజు, కోశాధికారి బొల్లేపల్లి స్వామి, జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, జిల్లా ఉపాధ్యక్షుడు పాక వెంకటేష్, లింగస్వామి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

మోటకొండూర్ : డీసీపీ రాజేశ్‌చంద్ర శుక్రవారం మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. వీలైనంత తొందరగా సొంత భవనం నిర్మించాలని, స్థలం కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని ఎస్ఐ మధుసూదన్‌కు సూచించారు. అవసరమైతే దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ నవీన్‌రెడ్డి ఉన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిణి

యాదగిరిగుట్ట రూరల్ : బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన స్నేహిత రెండో విడత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలలు ఏదైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100కు డయల్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌లను ఎక్కువగా వినియోగించరాదని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా పరిరక్షణ అధికారి పులుగుజ్జు సైదులు, ప్రధానోపాధ్యాయులు, స్నేహిత టీం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీలో కుంభం

భువనగిరిటౌన్ : ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో శనివారం డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్, తంగళ్లపల్లి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు.



క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యం

చండూరు(గట్టుప్పల) : విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన గట్టుప్పల మండల కేంద్రంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉదయం పాఠశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలు దేరింది. పాఠశాలకు వెళ్లకుండానే మార్గ మధ్యలోనే కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత


కోదాడరూరల్ : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ శనివారం తెలిపారు. ఏపీలోని నందిగామ ఇసుకరీచ్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు మండలంలోని కాపుగల్లు మీదుగా వస్తుండగా ఆ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. లారీలను సీజ్ చేసి డ్రైవర్లతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఫార్మా' కంపెనీ అనుమతులు రద్దుచేయండి

నల్లగొండ టౌన్, మునుగోడు: మునుగోడు మండలం కిష్టాపురం గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఫార్మా కంపెనీకి అనుమతులు రద్దుచేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన మునుగోడు నియోజకవర్గంలో సాగు, తాగునీటి కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేస్తుంటే.. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీ నిర్మించడానికి అనుతులు ఇవ్వడం అన్యాయమన్నారు. ఫార్మా కంపెనీలు ఇచ్చే డబ్బులకు ఆశపడి నియంత్రణ మండలి అధికారులు ఎలాంటి సర్వే చేయకుండా అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. ఫార్మా కంపెనీ నిర్మిస్తే నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అనుమతులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామి, చండూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జాజుల అంజయ్యగౌడ్, మునుగోడు, చిట్యాల, నారాయణపురం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మిర్యాల వెంకన్న, జనగాం రవిగౌడ్, తాటికొండ సంతోషసైదులు, పగిళ్ల భిక్షం, గుర్జ అరుణరామచంద్రం, భీమనపల్లి సైదులుగౌడ్, పోలగోని విజయలక్ష్మిసైదులు పాల్గొన్నారు.

మురళీ కృష్ణుడిగా లక్ష్మీనారసింహుడు





ఆలయ మాఢ వీధుల్లో శ్రీకృష్ణుడి అలంకార సేవలో ఊరేగుతున్న స్వామివారు, మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

- ఆధ్యాత్మిక వాతావరణంలో యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానాలయంలో శనివారం ఉదయం, రాత్రి విశేష పర్వాలను ఆచార్యులు కొనసాగించారు. ఉదయం శ్రీస్వామి వారు శ్రీమురళీ కృష్ణుడి అలంకార సేవలో.. సాయంత్రం పొన్న వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

మురళిని చేతపట్టి.. మాఢ వీధుల్లో విహరిస్తూ..

ప్రధానాలయంలో శ్రీస్వామి వారికి ఉదయం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 9గంటలకు మురళీ కృష్ణుడి(శ్రీకృష్ణ) అలంకార సేవను గావించారు. స్వామివారిని ప్రధానాలయంలోని దక్షిణ ప్రథమ ప్రాకారంలో ప్రత్యేక పల్లకీ సేవపై అధిష్ఠింపజేశారు. ఆచార్యులు అలంకార సేవకు హారతినిచ్చి తిరు, మాఢ వీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. అనంతరం మురళీ కృష్ణుడి అలంకార సేవను పడమటి రాజగోపురం



పొన్న వాహన సేవపై స్వామి వారు

ఎదుట ఉన్న వేంచేపు మండపం వద్ద అధిష్ఠించి వేద పారాయణం పఠించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, అధికారులు గజివెల్లి రఘు, సురేందర్‌రెడ్డి, రామ్మోహన్ ఉన్నారు.

పొన్న వాహనంపై ఊరేగింపు

ఆలయంలో సాయంత్రం శ్రీస్వామి వారిని పొన్న వాహన సేవలో ఊరేగింపు నిర్వహించారు.

ఉత్సవాల్లో నేడు..

శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ నిర్వహించనున్నారు. రాత్రి సింహ వాహన సేవ జరిపించనున్నారు.

ఆచార్యులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం సభ్యులు వేద పారాయణం పఠించారు. పొన్నవాహన సేవలో భక్తులు పాల్గొని వీక్షించారు.

భక్తులను ఆహ్లాదపరిచేలా..

యాదాద్రి క్షేత్రంలో వైటీడీఏ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చెన్నైకు చెందిన శ్రీదేవి నృత్యాలయం వారు నిర్వహించిన భరత నాట్యం, మంజుల రామస్వామి, కళాకారులు చేసిన భరత నాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం మోండలిన్ విద్వాంసులు డాక్టర్ శివప్రసాద్‌లచే ఈలపాట సంగీత కచేరీ నిర్వహించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం


యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యం అందిస్తున్నారు. కొండపైన బస్టాండ్, కొండ కింద కల్యాణ కట్ట వద్ద డాక్టర్లు వంశీకృష్ణ, హరీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నారు.

భక్తులకు అన్నదానం

భక్తులకు కొండ కింద గల గండి చెరువులోని దీక్షాపరుల మండపంలో అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీస్వామిని దర్శించుకొని, తిరుగు ప్రయాణంలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరత నాట్యం ప్రదర్శిస్తున్న కళాకారిణిలు



ఆలయ సన్నిధిలో భక్తులు



అన్నప్రసాదం కోసం క్యూకట్టిన భక్తులు

నల్లబెల్లం పట్టివేత

నూతనకల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన నల్లబెల్లం, పటిక, సారాను ఎక్సైజ్ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. సీఐ బాలాజీ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు రాములు నాయక్ వ్యవసాయ భూమిలో అక్రమంగా సారా తయారు చేస్తున్నాడని విశ్వసనీయ సమచారం మేరకు దాడులు జరపగా 19.50క్వింటాళ్ల నల్లబెల్లం, 50కేజీల పటికను స్వాధీనం చేసుకోవడంతో పాటు 10లీటర్ల సారాను పట్టుకున్నట్లు తెలిపారు. బెల్లం తరలించి సారా తయారీకి సహకరిస్తున్న పాతులోతు రెడ్యాపై కేసు నమోదు చేసి బెల్లం, పటిక, సారాను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ విద్యా విజ్ఞానం పొందాలి

- యాదాద్రి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మారుతిదేవి

యాదగిరిగుట్ట: ప్రతి ఒక్కరు విద్యా, విజ్ఞానంతో ముందుకు వెళ్తూ ప్రపంచ శిఖరాన నిలబడాల్సిన అవసరం ఉందని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతీదేవి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా యంత్రాంగం వారి సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అండ్ వాణిజ్య లైంగిక వ్యాపారం సంబంధిత చట్టాలు, బాధితుల న్యాయ సాధికారతా అంశంపై న్యాయ చైతన్య, లీగల్ సర్వీసెస్ మాడ్యూల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతిదేవి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కోర్టుకు వస్తున్న కేసులను చూసి మనస్సు చలించిపోతుందన్నారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.దశరథ రామయ్య మాట్లాడుతూ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం చేసే వారి ఆకృత్యాలను చట్టం చూస్తూ ఊరుకోదన్నారు. ఈ అవగాహన సదస్సులో ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి, ఆలేరు న్యాయ సేవ సమితి అధ్యక్షురాలు సుమలత, సీడబ్ల్యూసీ అధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా సంక్షేమాధికారిణి కృష్ణవేణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, పట్టణ పేదరిక నిర్మూలన శాఖ అధికారి రమేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, స్కీడ్ ఎన్‌జీవో సంస్థ నాగరాజు, యాదగిరిగుట్ట సీఐ సైదయ్య, డీసీపీఓ సైదులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.మారుతిదేవి

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భువనగిరి : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం యువ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్, బెట్టింగ్‌కు వ్యతిరేకంగా భువనగిరి పెద్ద చెరువు నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల వరకు 5కె రన్ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం యువ చదువుల వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రస్తుతం సమాజంలో డ్రగ్స్, గంజాయికి యువత బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. మాదక ద్రవ్యాల బారిన పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెప్పారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. యువ టీం చేసే కార్యక్రమాలకు తాము అండగా ఉంటామని చెప్పారు. అనంతరం 5కే రన్‌లో గెలుపొందిన నల్లగొండకు చెందిన రమేష్‌కు ప్రథమ బహుమతి కింద రూ. 15 వేలు, వరంగల్‌కు చెందిన సంగ్రామ్ రెండవ బహుమతి కింద రూ.10 వేలు, లింగారెడ్డికి మూడవ బహుమతి కింద రూ. 5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్ రత్నపురం బలరాం, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, రోటరీ మెంబర్షిప్ చైర్మన్ బుచ్చిరెడ్డి, యువ టీం కన్వీనర్ సూదగాని రాజు, సభ్యులు మోహన్, రంజిత్, రఘు, సురేష్, సన్నీ పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

బీబీనగర్: ఖాళీగా ఉన్న భూముల నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి సత్తిరెడ్డి, కీసర మండలం చీర్యాలకు చెందిన దాడి ధర్మేంధర్‌రెడ్డి, రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లికి చెందిన నసీర్ రెహమాన్, సనత్‌నగర్‌లోని బోరబండకు చెందిన షోకత్ అలీ, చాకలి రాము, అమీర్‌పేట్‌కు చెందిన వల్లపు రాములు, యూసఫ్‌గూడకు చెందిన గొర్రె రమేష్, వల్లె బాలకృష్ణ, సికింద్రాబాద్‌కు చెందిన ఇబ్రహీంలు బీబీనగర్ మండల రాఘవాపురం గ్రామ పరిధిలో గల మాక్సిమా రిసార్ట్‌ఫామ్స్‌లో 1210 చదరపు అడుగుల విస్తీర్ణం గల 204,221 ప్లాట్లు చాలా కాలంగా అలాగే ఉండడం, ఎలాంటి విక్రయాలు జరగకపోవడం గమనించారు. వీరు అదే గ్రామానికి చెందిన దొంతిరెడ్డి సత్తిరెడ్డి, కీసర మండలానికి చెందిన ధర్మేంధర్‌రెడ్డికి సమాచారం ఇచ్చి ఇద్దరూ కలిసి ప్లాట్లపై నకిలీ పత్రాలు సృష్టించడంలో దిట్ట అయిన నసీర్ రహమాన్‌ను ఆశ్రయించారు. దీంతో రహమాన్ నకిలీ భూపత్రాలు, ఆధార్‌కార్డులు తయారు చేశాడు. అలాగే ఫోర్జరీ పత్రాల ప్రకారం సారూప్య వయస్సు గల వ్యక్తుల కోసం షోకత్ అలీని సంప్రదించారు, దీంతో షోకత్ అలీ చాకలి రాము, వల్లపు రాములు స్వరుపాలను మార్చి జీపీఏ హోల్డర్లుగా నటించేలా వారిని సిద్ధం చేశాడు. అలాగే ఇబ్రహీం, బాలకృష్ణలను సాక్షులుగా ఉంచారు. అన్ని సిద్ధం అయ్యాక సత్తిరెడ్డి, ధర్మేంధర్‌రెడ్డిలు భూమిని ఓ బాధితుడికి రూ. 65లక్షలకు విక్రయించారు. దీంతో జరిగిన మోసం గురించి విశ్వసనీయ సమాచారం తెలుసుకున్న బీబీనగర్, మల్కాజిగిరి పోలీస్‌లు కలిసి ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి 9నకిలీ సేల్ డీడ్ పత్రాలు, 7లక్షల నగదు, రెండు కార్లు, 7సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇబ్రహీం, బాలకృష్ణలు పరారీలో ఉన్నారు. ముఠా మోసాన్ని గుట్టురట్టు చేసిన బీబీనగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్ఐలు రాఘురాం, వాసుదేవ్, స్పెషల్ ఆపరేషన్ సిబ్బందిని సీపీ అభినందించారు.



నకిలీ పత్రాలను చూపిస్తున్న సీపీ దేవేంద్ర సింగ్ చౌహాన్

జమాయిల్ తోట దగ్ధం

తిరుమలగిరి : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని జమాయిల్ తోట దగ్ధమైంది. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాశీ రాంరెడ్డికి చెందిన నాలుగు ఎకరాల జమాయిల్ తోటకు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో తోటలోని చెట్లన్నీ కాలిపోయ్యాయి. సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. సుమారు 4లక్షల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

ఇంటిని కూల్చిన వ్యక్తులపై కేసు

హుజూర్‌నగర్: ఇంటిని కూల్చిన వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన భూక్యా సంధ్య ఆమె భర్త ఉపేందర్ 2021 సంవత్సరంలో స్థానిక జంగాలగుడెం కాలనీలో పరాచ హిమబిందు వద్ద నుంచి 200 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రేకుల ఇంటిని నిర్మాణం చేసుకున్నారు. కాగా మధవరాయినిగూడేనికి చెందిన ఎస్ ప్రదీప్ మరో 11 మంది వ్యక్తులు 21వ తేదీ రాత్రి తమ ఇంటిని కూల్చివేసి విలువైన సామగ్రిని ధ్వంసం చేశారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



అలీ(ఫైల్)

నేరేడుచర్ల : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలోనగర్‌లో శనివారం ఆలస్యం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ పట్టణానికి చెందిన షేక్ అలీ వివాహం అయిన తరువాత తన భార్యతో కలిసి బతుకుదెరువు కోసం నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డులో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా వీరి కాపురం కొంత కాలం సాఫీగానే సాగింది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో 2022 సెప్టెంబర్ 8వ తేదీన భార్య అఫ్జల్ నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురు రాజీపడి 2022 నవంబరు 11న లోకాయుక్తలో కేసును కొట్టివేయించుకున్నారు. అయినా భార్యభర్తల మధ్య వాగ్వాదం సాగుతునే ఉంది. కాగా అలీ ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఇళ్ల మధ్యలోనే ఉన్న ఓ పాడు పడ్డా ట్రాక్టర్ షెడ్ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే సిబ్బందిని పంపించగా షెడ్‌లోని ఓ దూలానికి ఉరివేసుకొని ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి స్థానిక ఎస్ఐ నవీన్‌కుమార్‌తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీంతో ఈ యువకుడు జీవితంపై విరక్తి చెంది పడావుపడిన షెడ్‌కు వచ్చి నాలుగైదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ సంఘటన వద్దకు చేరుకున్న స్థానికులు అలీగా గుర్తించగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అలీగా గుర్తించడంతో పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలీ కుటుంబ సభ్యులు రాత్రి వరకు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

బొమ్మలరామారం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని మర్యాలకు చెందిన బుర్ర్హాల కుమార్(35)తో పాటు ఎర్రోళ్ల బాల్ నర్సింహ ఇటీవల మండలంలోని పెద్ద పర్వతాపూర్‌లోని బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఖాజీపేట్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. క్షత గాత్రులను ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి బుర్ర్హాల కుమార్ మృతి చెందాడు. బాల్ నర్సింహాకు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

క్లాస్‌మెంట్లతో పార్టీ ఉందని చెప్పి వెళ్లి..


- దారుణ హత్యకు గురైన ఎంజీయూ విద్యార్థి
- నిర్ఘాంతపోయిన అధ్యాపకులు, విద్యార్థులు
- యూనివర్సిటీలో విషాదం

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బీటెక్ ఈఈఈ 4వ సంవత్సరం చదువుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా రాచకొండ మండలం సిరసన గండ్లకు చెందిన నేనావత్ నవీన్ (20) హత్యోదంతం శుక్రవారం వెలుగులోకి రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. యూనివర్సిటీ విద్యార్థులందరితో కలిసిమెలిసి ఉంటూ చదువులో చురుగ్గా ఉండే నవీన్ హత్య వార్త విని విద్యార్థులు అధ్యాపకులు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. ఒక్క క్షణం విద్యార్థుల నోట మాట రాలేదు. నవీన్ ఇంటర్ క్లాస్‌మెంట్లతో హైదరాబాద్‌లో పార్టీ ఉందని ఈనెల 17న ఉదయం వెళ్లాడు. తిరిగి వస్తానని హాస్టల్‌లో అన్నం పట్టి ఉంచాలని స్నేహితులైన ప్రదీప్, తరుణ్‌లకు ఫోనులో చెప్పాడు. రాత్రి వరకు రాకపోవడంతో 8గంటలకు ఫోను చేశాడు. అన్నం పట్టి ఉంచాలని బస్సు ఎక్కి వస్తానని గేట్ వరకు బైక్ తీసుకురావాలని స్నేహితుడికి ఫోను చేశాడు. అర్ధరాత్రి దాటినా రాకపోవడంతో ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. మరుసటి రోజు నవీన్‌కు ఫోను చేసినా స్పందన లేదు.18న కూడా నవీన్ ఫోను స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో నవీన్ సన్నిహితంగా ఉండే యువతికి ఫోన్ చేశారు. రెండు రోజుల నుంచి నవీన్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని ఎక్కడున్నాడని ఆరా తీశారు. నాతో హరిహర కృష్ణ ఫోను నుంచి మాట్లాడినట్లు చెప్పి అతడి నంబర్‌ను మెసేజ్ చేసింది. స్నేహితుడు హరిహర కృష్ణకు ఫోను చేసి నవీన్ గురించి అడగడంతో ఇద్దరం కలిసి ఓఆర్‌ఆర్ వద్దకు వచ్చాము. అక్కడ బస్సు ఎక్కిస్తానని చెప్పాను. మా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవ పడ్డాం అని చెప్పి ఫోన్ కట్ చేశాడు.

కీడు శంకించిన స్నేహితులు

నవీన్‌కుమార్ యూనివర్సిటీ నుంచి 17న వెళ్లి 23 వ తేదీ వరకు ఆచూకీ లేకపోవడంతో ఏదో జరిగి ఉంటుందని స్నేహితులు కీడును శంకించారు. 3రోజుల పాటు నవీన్ గురించి ఇంటర్ క్లాస్‌మెంట్ అయిన యువతిని, హరిహర కృష్ణను ఫోనులో అడిగినా చెప్పలేదు. యూనివర్సిటీ నుంచి కొందరు విద్యార్థులు హరిహర కృష్ణ చదివే ఫిర్జాత్ గూడ అరోరా ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లి అడిగారు. ఆ తర్వాత హరిహరకృష్ణ అక్క, బావల వద్ద ఉంటూ చదువుకోవడంతో వారి వద్దకు వెళ్లి నవీన్ గురించి అడిగారు. అనంతరం నవీన్ మామ ఈరయ్యకు ఫోను చేసి విషయం చెప్పారు. ఈనెల 22న తండ్రి శంకరయ్య యూనివర్సిటీకి వచ్చి ఆరా తీసి నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేయగా హరిహర కృష్ణ ప్లాన్‌ప్రకారం హత్య చేశాడని గుర్తించారు. దీంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విషాదకర వాతావరణం నెలకొంది.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: సెల్ టవర్లలో విలువైన పరికరాలను అపహరిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి ఉపయోగించే పరికరాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అపూర్వరావు నిందితుల వివరాలను వెల్లడించారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణమానస కాలనీ, ఐలాపురం, శ్రీనివాసనగర్‌లలో ఉన్న ఏయిర్‌టెల్ టవర్‌లో బేస్‌బాండ్, ఆర్ఆర్‌యూలను ఈనెల 20న దొంగించినట్లు సెల్‌టవర్ ఇన్‌చార్జి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సెల్‌టవర్ లొకేషన్ ఆధారంగా నేరస్తులను గుర్తించారు. ధీరావత్‌తండాకు చెందిన ధీరావత్ నవీన్, ధనావత్ కృష్ణ అలియాస్ విష్ణు, ధీరావాత్ మోహన్‌లుగా గుర్తించారు. వీరు 5 సంవత్సరాలుగా సెల్ టవర్‌లో పని చేయడం వల్లన విలువైన వస్తువులపై అవగాహన కలిగి ఉన్నారు. గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళలో వెళ్లి బిబియూ, ఆర్ఆర్‌యూ , కేబుల్లను చోరీ చేసి హైదరాబాద్‌లో అమ్మేవారు. ఒక్కసారి అమ్మిన సామగ్రితో ప్రయోజనం ఉన్నట్లు భావించిన ముగ్గురు నేరస్తులు జిల్లాలో 11 మండలాల్లో చోరీ చేశారు. మిర్యాలగూడ , త్రిపురారం, వేములపల్లి, నిడమనూరు, తిరుమలగిరిసాగర్, పెద్దవూర , కొండమల్లేపల్లి, దేవరకొండ, చింతపల్లి, నేరడుకొమ్ము, పోలీస్‌స్టేషన్‌లో వీరిపై కేసులు ఉన్నాయి. నిందితులను రిమాండ్ చేసినట్లు తెలిపారు. పరికరాలను కొనుగోలు చేసిన వారిని అరెస్టు చేస్తామని తెలిపారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నర్సింహను ఎస్పీ అభినందించారు.